క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కుభీర్: మండలకేంద్రంలోని కేజీబీవీలో ఇంగ్లిష్, కంప్యూటర్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ బోధనకు పీజీ, కంప్యూటర్ బోధనకు బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ చదివి ఉండాలని పేర్కొన్నారు. అర్హులు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు కంప్యూటర్ సైన్స్‌లో 40 సీట్లు ఉన్నాయని.. పదోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మూడు సబ్‌స్టేషన్లు మంజూరు

భైంసాటౌన్: నియోజకవర్గానికి మూడు చోట్ల కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ఓ ప్రకటనలో తానూరు మండలంలోని కోలూర్, భైంసా మండలంలోని మహాగాం, కుభీర్ మండలంలోని పల్సి గ్రామాల్లో రూ.7.50 కోట్లతో సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో రైతులకు విద్యుత్ సమస్యలు తీరుతాయని వెల్లడించారు.

భూదాతకు నివాళి



నివాళులర్పిస్తున్న సభ్యులు

కుభీర్: మండలంలోని సౌన గ్రామానికి చెందిన కెమ్‌శెట్టి బాపురావ్ మూడో వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈయన రామకృష్ణ సేవాసమితి, వివేకానంద ఆవాసం భైంసా వారికి మూడెకరాల వ్యవసాయ భూమిని దానంగా ఇచ్చారు. సౌన గ్రామంలో వివేకానంద ఆవాసము ఆధ్వర్యంలో వైద్యశిబిరం,అన్నదానం నిర్వహించారు. సేవా భారతి ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్, ఆర్ఎస్ఎస్ నాయకులు దిగంబర్, జిల్లా సహ సంచాలక్ సాదుల కృష్ణదాస్, ఆవాసం అధ్యక్షులు శైలేశ్ మాశెట్టివార్, కమిటీ సభ్యులు నారాయణ వైద్యులు తదితరులు ఉన్నారు.

ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



దెబ్బతిన్న పైకప్పు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధి నడింపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి ఈదురుగాలుల వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈసందర్భంగా గ్రామానికే చెందిన బోగ నారాయణ ఇంటి రేకులకప్పు గాలికి ఎగిరిపోయి మరోచోట పడింది. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు వేడుకున్నాడు.

ఉద్యోగానికి ఎంపిక



అరవింద్

కడెం: మండలంలోని పెద్ద బెల్లాల్ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన ఆకుల అరవింద్ బ్యాంకు ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఏప్రిల్ 12న పరీక్ష రాయగా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. అరవింద్ ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఖానాపూర్ సీడీపీవోగా నాగలక్ష్మి



ఖానాపూర్: ఐసీడీఎస్ ఖానాపూర్ సీడీపీవోగా నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీవోగా పనిచేసిన సరిత నిర్మల్ వెళ్లగా నిర్మల్‌లో ఏసీడీపీవో గా పనిచేసిన నాగలక్ష్మి ఖానాపూర్ సీడీపీవోగా బాధ్యతలు స్వీకరించారు.

పంపిణీ వేగవంతం చేయండి

దస్తురాబాద్: రేషన్ బియ్యం పంపిణీని వేగవంతం చేయాలని తహసీల్దార్ విశ్వంభర్.. డీలర్లకు సూచించారు. బుధవారం మండలంలోని గొడిసేర్యాల గ్రామంలోని రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ ఆర్తి తదితరులు ఉన్నారు.

అసత్యాలు ప్రచారం చేస్తే కేసు

దస్తురాబాద్: సోషల్ మీడియాలో అసత్యాలను ప్రచారం చేసి గొడవలు సృష్టించేవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై సాయికృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రేవోజీపేట గ్రామస్తులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామంలోని వాట్సాప్ గ్రూపుల్లోనూ ఉద్రిక్తతలు సృష్టిస్తే అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిల్వ బియ్యాన్ని వండొద్దు

కుంటాల: పాఠశాలలు తెరుచుకున్న అనంతరం నిల్వ ఉన్న బియ్యాన్ని వండొద్దని తహసీల్దార్ కమల్ సింగ్ ఆదేశించారు. బుధవారం కుంటాల ఆదర్శ పాఠశాలలోని వసతిగృహాన్ని తనిఖీ చేశారు. నిల్వ ఉన్న బియ్యాన్ని భైంసా ఎమ్మెల్యేస్ పాయింట్‌కు తరలించి కొత్త బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. ఆర్ఐ రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

పడిపోతాను.. పట్టించుకోండి



సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామ సమీపంలోని పోచమ్మగుట్ట వద్ద కోర్వ రాము అనే రైతు చేనులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం కింది భాగంలో రెండు ఫీట్ల వరకు సిమెంటు పగిలిపోయింది.. ఇనుప చువ్వలు తేలి పడేలా ఉంది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవట్లేదని.. స్తంభం పడిపోకముందే కొత్త స్తంభం పాతి తీగలు సరిచేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాత పుస్తకాలు అమ్మేస్తున్నారు.?



పాఠశాల ఆవరణలో పడేసిన పుస్తకాలు



సంచుల్లో నింపుతున్న దృశ్యం



పాఠశాల గేటు ఎదుట పాఠ్యపుస్తకాలను తరలించేందుకు ఆటో ట్రాలీ

జిల్లాకేంద్రంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఉర్దూ మీడియం విద్యార్థుల పాఠ్యపుస్తకాలను బుధవారం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం చిరిగిన పాతపాఠ్యపుస్తకాలను విద్యాధికారి అనుమతితోనే స్క్రాప్ కింద అమ్మాలి. కానీ ఎలాంటి అనుమతుల్లేకుండా పాత పాఠ్యపుస్తకాలను సంచుల్లో నింపి.. తూకం వేసి తరలించేందుకు ట్రాలీని కూడా పాఠశాలకు తీసుకొచ్చారు. అదే సమయంలో పాఠశాలకు వెళ్లిన సాక్షి ఈ దృశ్యాలను క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

‘రేషన్’ కోసం పాట్లు



కుంటాల: వానాకాలం నేపథ్యంలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందిస్తుండటంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి నెల కేంద్రం పంపిణీ చేసే ఐదు కిలోలకు ఒకసారి, రాష్ట్రం పంపిణీ చేసే కిలో బియ్యం కోసం మరోసారి ఇలా ఆరుసార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. దీంతో ఒక్కో లబ్ధిదారుడికి 15 నుంచి 20 నిమిషాలు పడుతుంది. కుంటాలలో బుధవారం ఖాళీ సంచులను క్యూ లైన్‌లో పెట్టి పలువురు లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే ‘భూభారతి’



టెంబుర్నిలో మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకళ్యాణి



కన్నపూర్‌లో పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్(జి): భూసమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం తెచ్చినట్లు ఆర్డీవో రత్న కళ్యాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టెంబుర్ని గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో పరిశీలించి దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. గొల్లమాడలో 36, టెంబుర్నిలో 10 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ వాహీదొద్దీన్, ఆర్ఐలు సుమలత, నవత జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో తహసీల్దార్ సరిత, పొట్టపెల్లి(కే) గ్రామంలో డీటీ బాబుసింగ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల రైతులు తమ భూసమస్యల గురించి దరఖాస్తులు చేసుకున్నారు. ఆర్ఐ నరేందర్‌రెడ్డి, సిబ్బంది మహేందర్, కిరణ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్నపూర్, మొహళ గ్రామాల్లో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 45 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో తప్పనిసరిగా శుభ్రత పాటించాలి



వద్యాల్‌లో మాట్లాడుతున్న ఎంఈవో అశోక్‌వర్మ



తానూరు: మాట్లాడుతున్న ఎంఈవో నరేందర్

భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంఈవో సుభాశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కేజీబీవీలో స్కావెంజర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల స్కావెంజర్లు, శిక్షకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేసి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంఈవో అశోక్‌వర్మ అన్నారు. బుధవారం మండలంలోని వద్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కావెంజర్లకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. వంటపాత్రలు, కిచెన్ షెడ్లు పరిసరాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిత్యం శుభ్రంగా ఉంచాలన్నారు. వాటర్ ట్యాంకులు, తరగతి గదులు రోజు శుభ్రంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ కిషన్, శంకర్, కిష్టయ్య, ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది హర్షద్, మహేందర్, సుధాకర్, గణేశ్, స్పందన్ పాల్గొన్నారు.

కడెం: పాఠశాలల శుభ్రతపై స్కావెంజర్లు శ్రద్ధ వహించాలని ఎంఈవో షేక్ హుస్సేన్ అన్నారు. కడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కావెంజర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. పాఠశాల గదులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ బొమ్మిడి మహేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

లోకేశ్వరం: పాఠశాల పరిసరాలు, ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని రిసోర్స్ పర్సన్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం లోకేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కావెంజర్లకు, మధ్యాహ్న భోజన కార్మికులకు పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. భోజనం వండే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈవో చంద్రకాంత్, రిసోర్స్ పర్సన్ మురళీధర్, హెచ్ఎంలు ఉన్నారు.

తానూరు: పాఠశాలల్లో వంటగది, పరిసరాల్లో శుభ్రత పాటించాలని ఎంఈవో నరేందర్ అన్నారు. తానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లకు వేర్వేరుగా నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, సాయిబాబు, మల్లన్న, ఉపాధ్యాయుల వందన తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణలో రిసోర్స్ పర్సన్లుగా కుంట సాయికుమార్, కుర్మే నాగయ్య వ్యవహరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

మంత్రిని కలిసిన జిల్లా నాయకులు



మంత్రి వివేక్‌తో శ్రీహరిరావు, నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామిని హైదరాబాదులోని తన నివాసంలో బుధవారం జిల్లా మాల మహానాడు నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. మాల మహానాడు జిల్లా నాయకులు కుంటోళ్ల వెంకటస్వామి, బత్తుల రంజిత్, బొడ్డు లక్ష్మణ్, ఎలుమల రాజేశ్వర్, బోస్, ఆకుల రమేశ్, తలారి రాజేశ్వర్, కప్పకంటి సురేశ్, అలుగునూరి నరేందర్, తలారి సుదర్శన్, తలారి భూమన్న, గంగాధర్, పులి రమేశ్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: హైదరాబాద్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వివేక్ వెంకటస్వామి దంపతులను శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వివేక్ వెంకటస్వామిని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమభీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, డైరెక్టర్ నిమ్మ సాయన్న, కాల్వ ఆలయ చైర్మన్ అంగూర్ మహేందర్, దాసరి శ్రీహరి, పడాల శ్రీను, లింగన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



తానూరులో చిన్నారులతో ర్యాలీ తీస్తున్న టీచర్లు

ఖానాపూర్: మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ ఆధర్యంలో ఈనెల 10 నుంచి 17 వరకు అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు బుధవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులకు పూలతో స్వాగతం పలికి ఎగ్ బిర్యానీ భోజనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీడీపీవో నాగలక్ష్మి మాట్లాడారు. వారోత్సవాల్లో ఒకరోజు చిన్నారులకు ఎగ్ బిర్యానీ భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ టీచర్ సరళాదేవి తదితరులు ఉన్నారు.

తానూరు: మండలకేంద్రంలో అమ్మమాట– అంగన్‌వాడీ బాట నిర్వహించారు. చిన్నారులతో కలిసి వీధుల్లో ర్యాలీ తీశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, అనిత, బినీషా, సావిత్రి, వందన సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి, వట్టోలి, లోకేశ్వరం గ్రామాల్లో అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. వీధుల గుండా ర్యాలీ తీసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వసతులను వివరించారు. గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు విమల, లలితలు ఉన్నారు.

ఘనంగా వటసావిత్రి వేడుకలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో బుధవారం వాసవిక్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో వటసావిత్రి పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అభిషేక్‌శర్మ పూజాది కార్యక్రమాలు చేపట్టి వ్రతం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం క్లబ్ సభ్యులు ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ సభ్యులు స్వరూప రాణి, శ్రీలత, రమ, పద్మజ తదితరులు ఉన్నారు.

పంచాయతీల నిర్వహణ భారం భరించలేం



కుంటాల: ట్రాక్టర్ల తాళం చెవులను ఎంపీడీవోకు అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

భైంసారూరల్: 18 నెలలుగా గ్రామాలకు నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారిందని కార్యదర్శులు వాపోతున్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈమేరకు సొంత నిధులను పంచాయతీలకు ఖర్చు చేయలేమని పంచాయతీల ట్రాక్టర్ తాళాలను ఎంపీడీవోకు అందించారు. కార్యదర్శులు శ్రీధర్, దేవన్న తదితరులు ఉన్నారు.

మామడ: గ్రామాల నిర్వహణకు నిధులు అందించాలని బుధవారం ఎంపీవో ఖలీల్‌హైమద్‌కు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. నిధులు రాక పంచాయతీల్లో పనుల కోసం అప్పులు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈమేరకు పంచాయతీ ట్రాక్టర్ల తాళంచెవులను ఎంపీవోకు అందించారు.

కుంటాల: ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సొంత డబ్బులతో ట్రాక్టర్‌కు డీజిల్ పోయించాల్సి వస్తుందని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఈమేరకు బుధవారం మండలంలోని 15 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో లింబాద్రికి ట్రాక్టర్ల తాళం చెవులను అప్పగించారు. ప్రతి నెల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

డీ–1 పట్టాల సర్వే చేపట్టండి

సోన్: డీ–1పట్టాల సర్వే చేపట్టాలని మండలంలోని న్యూవెల్మల్ గ్రామస్తులు బుధవారం ల్యాండ్ రికార్డ్సు ఏడీ సుదర్శన్‌నాయక్, తహసీల్దార్ మల్లేశ్ రెడ్డిని వేర్వేరుగా కలిసి విన్నవించారు. వివరాల్లోకి వెళితే.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఏడీఎస్ అండ్ ఎల్ఆర్ నిర్మల్ డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, ముగ్గురు మండలాల సర్వేయర్లతో సర్వే పూర్తి చేశారు. ఈసందర్భంగావ వీడీసీ సభ్యులు, సేత్వారి రైతులు మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామంలో పట్టా పాస్‌పుస్తకాల్లోని భూములకు సర్వేయర్లు సర్వే పూర్తి చేశారని తెలిపారు. గ్రామంలో సేత్వారు మంజూరు కానీ సర్వే నంబర్లలో ఉన్న భూమలను సర్వే చేసి సేత్వారు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొడ్డ రాజేశ్వర్, వీడీసీ చైర్మన్ జిలకర వేణు, కేశెట్టి మల్లయ్య, ఎలుగు రాజలింగం, నర్సింగ్‌రావు రాజేందర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కోత విధిస్తున్నారని ఫిర్యాదు

ముధోల్: మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోత విధిస్తూ మోసం చేస్తున్నారని పలువురు రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మొదట సెంటర్ వద్ద క్వింటాల్‌కు 5 కిలోలు కోత విధిస్తూ, మిల్లు వద్ద రెండోసారి మూడు కిలోలను మొత్తం క్వింటాలుకు 8 కిలోల చొప్పున ధాన్యం కోత విధిస్తున్నారని.. న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించండి

పెంబి: మండల కేంద్రంలోని ఒకటో వార్డు పరిధి దళిత కాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్‌లో డీపీవో శ్రీనివాస్‌కు కాలనీవాసులు విన్నవించారు. ఏటా వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని.. సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నర్సయ్య, రాజు, సాయిరాం, సురేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

హద్దులు నిర్ణయించాలని వినతి

దస్తురాబాద్: మండలకేంద్రంలోని పెద్ద చెరువు, కుంటలకు హద్దులు నిర్ణయించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ విశ్వంబర్‌కు దస్తురాబాద్ మత్స్యకార సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు శిఖంలో పట్టాలున్నాయని కొందరు భూములను సాగు చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. సర్వేయర్‌తో పెద్ద చెరువు హద్దులు ఏర్పాటు చేసి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు శంకర్, రాజన్న, నర్సయ్య, సత్తన్న, శ్రీనివాస్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి

కుంటాల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు బుధవారం కుంటాలలో ప్రచారం చేశారు. కళాశాలలో చేరితే ఎంసెట్, జేఈఈ, డిపార్ట్‌మెంట్ పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గజేందర్, లింగయ్య, కె.ముత్యం, ఉమేశ్, హరీశ్, సురేశ్, చిరంజీవి, టి.ముత్యం తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

సోన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాజనర్సయ్య అన్నారు. బుధవారం సోన్ రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల మత్స్యకారుల కుటుంబాలకు మత్స్య సంపద యోజనపై అవగాహన కల్పించారు. చేపలు పట్టే వారు సొసైటీలలో నమోదు చేసుకొని గుర్తింపుకార్డులతో బ్యాంకులను సంప్రదించాలని సూచించారు. లీడ్ బ్యాంక్ అధికారులు రాంగోపాల్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని లక్కీ క్రికెట్ అకాడమీలో 50 రోజులుగా నిర్వహించిన క్రికెట్ వేసవి ప్రత్యేక శిక్షణ బుధవారం ముగిసింది. చివరిరోజు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టు సభ్యులకు కప్‌లను అందజేశారు. అకాడమీ డైరెక్టర్ బేర సుదర్శన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, డాక్టర్ చుక్కా శ్రీకాంత్, సామ రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

నర్సాపూర్ (జి): సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంపీపీఎస్ హెచ్ఎం వీర్బా పాటిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉమారాణి, అంగన్వాడీ కార్యకర్త గంగామణి తదితరులు ఉన్నారు.

శిథిల పాఠశాలలను కూల్చివేసేందుకు చర్యలు

కుంటాల: మండలంలోని లింబా(బి), సూర్యాపూర్, కొత్త వెంకూర్ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, డీఈవో రామారావు ఆదేశాల మేరకు కూల్చివేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టాలి

ఖానాపూర్: ప్రభుత్వం నకిలీ ఎరువులు, విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆర్ఐ నగేశ్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పోడు రైతులకు రైతు భరోసా చెల్లించి వెంటనే సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల రాజన్న, అడ్డగట్ల శంకర్, శంకర్, ఆత్రం భీంరావు, పిట్ల భీమన్న, రాజు, సుమన్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో నలుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా.. బుధవారం సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. పనులు వేగవంతం చేయాలని.. బిల్లులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని ఏఎంసీ చైర్మన్ పేర్కొన్నారు. రాజేశ్వర్, చిన్నయ్య, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో శివకుమార్ భూమిపూజ చేశారు. గ్రామంలో 43 ఇళ్లు మంజూరు కాగా ఐదు ఇళ్లకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ శ్రీకాంత్, కార్యదర్శి గంగాధర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు రావుల శ్రీనివాస్, సుర్గుల సునీత, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కల్లెడ గ్రామంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్‌వర్మ, ఎలగడపలో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు అబ్దుల్ రహీం, నాయకులు మహమ్మద్ సలీం, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, నాయకులు సంజీవ్, భూమేశ్, మల్లేశ్, లక్ష్మీనారాయణ, సత్యం, తదితరులున్నారు.

మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సారంగపూర్: బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తవుతున్నందున ప్రధాని మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్.. ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని జామ్ గ్రామంలో కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. మండల అధ్యక్షుడు కాల్వ నరేశ్, నాయకులు చెన్ను రాజేశ్వర్, తిరుమలచారి, ఆయా గ్రామాల నాయకులు, తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: పచ్చదనం పెరిగేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మండలంలోని మాటేగాం, దేగాం గ్రామాల్లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, అశోక్, సట్ల సాయినాథ్, ఆకాశ్, చంద్రకాంత్ పటేల్, నాగన్న, రాజేశ్వర్ పటేల్, గంగాప్రసాద్, రామకృష్ణ, లింగన్న తదితరులు ఉన్నారు.

గ్రంథాల పంపిణీ

తానూరు: మండలంలోని జౌలా(బి) గ్రామంలో వార్‌కరి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం జ్ఞానేశ్వరి పారాయణం తెలుగు గ్రంథాలను యువకు లకు అందజేశారు. ఇందులో వార్‌కరి భక్తుల జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ , బాలాజీ, సాయినాథ్ పటేల్ తదితరులు ఉన్నారు.